# గుట్టుచప్పుడు కాకుండా భూసేకరణ

- గిరిజన తండాల్లో మళ్లీ భూసేకరణ మంటలు
- ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే స్వాధీనం
- 118 మంది రైతుల నుంచి సంతకాల సేకరణ

వికారాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లాలో ఫార్మా విలేజ్ ప్రతిపాదన వెనక్కి తీసుకుంటూ సర్కారు జీవో ఇచ్చింది. కానీ రైతుల నుంచి భూములు సేకరించి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ సభలో తేల్చిచెప్పిన నేపథ్యంలో అధికారులు ప్రజాభిప్రాయం లేకుండానే భూమలు స్వాధీనం చేసుకుంటున్నారు. సర్కారు దౌర్జనంగా వ్యవహరిస్తున్నదని, అధికారులు భయపెట్టి, బెదిరించి భూములు లాక్కుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు అభివృద్ధి ముసుగులో రైతుల జీవితాలను ఆగం చేస్తున్నదని మండిపడుతున్నారు.

### పడగనీడలో పల్లెలు.. తల్లడిల్లుతున్న తండాలు

రైతుల ఆందోళనల తర్వాత ఫార్మా విలేజ్‌కు ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటును తెరమీదకు తీసుకువచ్చింది. 1278 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించింది. హకీంపేట, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో భూసేకరణఖు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు రైతుల అధికారులు 118 మంది రైతుల నుంచి 226 ఎకరాల స్వాధీనానికి అంగీకార పత్రాలు తీసుకున్నారు. ప్రభుత్వం అడ్డదారిలో భూసేకరణ చేస్తున్నదని గిరిజన, ప్రజాసంఘాల నేతలు మండిపడుతున్నారు. తిరగబడితే మళ్లీ ఎలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతారో అనే భయంతోనే సంతకాలు చేయాల్సి వస్తున్నదని బాధిత రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# రైతుల నెత్తిన గ్రీన్‌ఫీల్డ్ పిడుగు!

- ఫోర్త్‌సిటీకి 330 ఫీట్ల రోడ్డుకు సర్కారు ప్రణాళిక
- 441.34 ఎకరాల భూసేకరణకు ముగిసిన సర్వే
- భూమిని కోల్పోనున్న 1909 మంది అన్నదాతలు
- ఫార్మా సిటీకి బీఆర్‌ఎస్ హయాంలోనే భూసేకరణ
- మళ్లీ భూసేకరణ ఎందుకని రైతుల ఆందోళనబాట



పోలీసులతో మాట్లాడుతున్న మహిళా రైతులు

కందుకూరు, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై మరో పిడుగు వేసేందుకు సిద్ధమైంది. లగచర్లలో రైతుల పోరాటం మరవకముందే అన్నదాతలపై సర్కారు మరో పిడుగు వేస్తున్నది. ఫోర్త్ సిటీ పేరిట కొత్త నగరం నిర్మిస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పలు వేదికలపై ప్రకటించారు. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లోనే ప్రతిపాదిత ఫోర్త్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కానీ రోడ్ల కోసమంటూ సర్కారు మరోసారి అవసరానికి మించి భూములు సేకరించేందుకు సిద్ధమైంది. దీంతో అన్నదాతలు ఆందోళనబాట పట్టారు.

### నాడు ఒప్పందం.. నేడు నిర్బంధం

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఫార్మా సిటీ ఏర్పాటుకు గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఒప్పించి, మెప్పించి 14వేల ఎకరాలకుపైగా భూమి సేకరించింది. ప్రస్తుతం ఈ భూములన్నీ ప్రభుత్వ స్వాధీనంలోనే ఉన్నాయి. ఫార్మా సిటీ కోసం నాగార్జునసాగర్, శ్రీశైలం హైవే, ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా విశాలమైన రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ఇందులో కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట(బేగరికంచె) వరకు 200 ఫీట్ల రోడ్డు నిర్మాణం పూర్తయింది. కాంగ్రెస్ సర్కారు ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేసింది. ఆ భూముల్లోనే ఫోర్త్ సిటీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్-13 కొంగరకలాన్ నుంచి బేగరికంచే వరకు 330 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఈ రోడ్డు వల్ల 1909 మంది రైతులు 441.34 ఎకరాల భూమి కోల్పోనున్నారు. ఇందులో చాలామంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. జీవనాధారంగా ఉన్న భూమంతా కోల్పోతే తాము ఎలా బ్రతికేది అంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సర్వే మొదలు పెట్టినప్పుడే రైతులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. కొన్నిచోట్ల సర్వేను అడ్డుకున్నారు. ఇప్పటికే 200 ఫీట్ల రోడ్డు ఉండగా సమాంతరంగా మరో రోడ్డు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కానీ ప్రభుత్వం పోలీసు పహారా మధ్య రైతులను నిర్బంధించి మరీ సర్వేను ముగించింది.

### పంతం వీడని ప్రభుత్వం.. తప్పదు న్యాయపోరాటం

గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సేకరించనున్న 441.34 ఎకరాల భూములు కందుకూరు మండల పరిధిలోని లేమూరు, తిమ్మాపూరు, రాచులూరు, గుమ్మడవెల్లి(రిజర్వ్ ఫారెస్ట్), పంజగూడ(టీటీఐసీ), మీర్‌ఖాన్‌పేట్‌లో భూములు ఉన్నాయి. సర్వే మొదలైనప్పటి నుంచి రైతులు ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతూ తమ భూములను కాపాడాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకుపోతుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఫార్మా సిటీకి వేసిన రోడ్లను వినియోగించుకోవడం వల్ల తమ భూములు తమకు దక్కుతాయని చెబుతున్నారు. ప్రభుత్వం మొండివైఖరితో ముందుకు వెళితే తాము న్యాయ పోరాటం చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేదిలేదని తెగేసి చెబుతున్నారు.

### నా రెండెకరాల పొలం పోతుంది



భూమిని నమ్ముకుని జీవిస్తున్నా. వ్యవసాయంపై ఆధారపడి మా పిల్లల్ని చదివించుకుంటున్న. హఠాత్తుగా ప్రభుత్వం నా పొలం నుంచి రోడ్డు తీసుకుపోయేందుకు సర్వే చేసింది. సర్వే వద్దని అధికారులకు మొరపెట్టుకున్నా.. పోలీసులు వచ్చి బలవంతంగా సర్వే పూర్తి చేసిండ్రు. నాకున్నదే రెండెకరాలు. ఉన్న కాస్త పొలం పోతే ఎట్ల బతకాలి? నా భూమిని ఇచ్చేది లేదు.

- ధ్యాసాని సుధాకర్‌రెడ్డి, రైతు

### భూమి పోయాక మేం ఉంటే ఏంది, పోతే ఏంది?



మేం చస్తే కూడా బొంద పెట్టడానికి జాగా లేకుండా చేస్తున్నరు. నాకున్న రెండున్నర ఎకరాల పొలం కూడా రోడ్డుకే పోతుందట. అందులో ఉన్న బోరు, పంటలు పోతున్నయి. ఈ రేవంత్‌రెడ్డి ఎందుకిట్ల చేస్తుండో అర్థమైతలేదు? ప్రభుత్వానికి న్యాయం అయితదా? ప్రభుత్వ భూమి పక్కనే ఉంది, అండ్లకెల్లి రోడ్డు తీసుకపోవాలి. మా భూములే దొరికినయా? మమ్ములను సంపి రోడ్డు ఏసుకోవాలి. రోడ్డుకు మాత్రం పొలం ఇయ్యం.

- రమావత్ చాందిని, గాజులబుర్జుతండా

### న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తా



రేవంత్‌రెడ్డికి రైతులంటే ఇంత చులకనా? మాకు నోటీసులు ఇయ్యకుండనే భూమి సర్వే చేసిండ్రు. భూములను ఇయ్యడానికి మేము సిద్ధంగా లేము. ఉద్యోగాలు రాకపోవడంతో చదువులు మానేసి వ్యవసాయం చేసుకుంటున్నం. నాకు రెండెకరాల భూమి మాత్రమే ఉంది. అందులో నుంచి రోడ్డు వేయడానికి సర్వే చేసింండ్రు. ఉన్న రెండెకరాల భూమి ఇస్తే నేనెట్ల బతకాలి? నా భూమి పోకుండా ఉండేందుకు న్యాయ పోరాటం చేస్తాను.

- శ్రీకాంత్, అగర్‌మియాగూడ

### భూములిచ్చేది లేదు... పోరాటానికి సిద్ధంగా ఉన్న



బలవంతంగా సర్వే నిర్వహించారు. నా భూమిలోకి నేను పోవడానికి కూడా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వచ్చింది. మమ్ముల్ని మా పొలాల దగ్గరకు పోనీయలేదు. మార్పు అంటే ఇదానా రేవంత్‌రెడ్డి? పొలం పోతే పొలం వస్తదా? నీకు రైతుల సమస్యలు పట్టవా? భూములు గుంజుకోవడం న్యాయమా? మేం భూములిచ్చేది లేదు, ఎంతకైనా తెగిస్తాం. పోలీసులను పెట్టి భూములు తీసుకుంటే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తాం.

- బండ రమేశ్, రైతు

### చావనైనా చస్తా.. భూమి మాత్రం ఇయ్యను



చావనైనా చస్తాంగానీ భూమి మాత్రం ఇయ్యం. అప్పులు చేసి పౌల్ట్రీ పెట్టుకున్నం. ఇంకో ఎకరంన్నరలో పూల తోట వేశాం. ఈ మొత్తం భూమి కూడా రోడ్డులో పోతదట. భూమి సర్వే కూడా మాకు తెల్వకుండానే చేసిండ్రు. మాకు అధికారులు సమాచారం ఇస్తలేరు. భూమి పోతే సావే గతి. మేం పొలాన్ని నమ్ముకొని బతుకుతున్నం. పొలం పోతే మా బతుకులు ఎట్లా? ప్రభుత్వం వెంటనే రోడ్డు వేయడం ఆపేయాలి.

- కాడమోని పద్మ, తుర్కగూడ



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేశ్‌రెడ్డి, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర

# చిన్నకోడూరులో రైల్వేస్టేషన్ కావాలి

- *నిలిపివేసిన పలు రైల్వే సేవలను పునరుద్ధరించాలి*
- *రైల్వేశాఖమంత్రికి బీఆర్‌ఎస్ ఎంపీల వినతి*

*హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో రైల్వేస్టేషన్ ఏర్పాటు, పలు రైళ్ల పునరుద్ధరణ తదితర అంశాలను వినతిపత్రంలో పేర్కొన్నారు. మనోహరాబాద్-కొత్తపల్లి నూతన రైల్వేలైన్ పనుల్లో భాగంగా చిన్నకోడురు వద్ద స్టేషన్ ఏర్పాటుచేయాలని, ఖమ్మం జిల్లాలోని గాంధీపురం రైల్వేస్టేషన్‌కు మరమ్మతులు చేయాలని కోరారు. 12746 నంబర్ రైలు అక్కడ ఆగకపోవడం వల్ల హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. డోర్నకల్-భద్రాచలం రైలును కొవిడ్ సమయంలో రద్దు చేశారని దాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తిచేశారు. బెలగాం-మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడపాలని, గయా-చెన్నై ఎక్స్‌ప్రెస్‌ను ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఆగేలా చూడాలని కోరారు.*

### కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయండి

*బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్‌తో కలిసి సోమవారం ఢిల్లీలోని రైల్ నిలయంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. బయ్యారంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలని వినతిపత్రం అందజేశారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు తెలంగాణ ప్రజల యాభై ఏండ్ల కల అని చెప్పారు. వెంటనే దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ కోచ్ ఫ్యాక్టరీలో 60 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కాగా, ఇందుకు రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.*



*యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో సోమవారం ట్రిపుల్ ఆర్ భూసేకరణలో భాగంగా పశువుల షెడ్లను సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. జీవనోపాధి పొందుతున్న భూములు పోతే ఎట్లా బతకాలని వారు అధికారుల ఎదుట వాపోయారు. – చౌటుప్పల్*



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు జగిత్యాల కలెక్టరేట్‌కు వెళ్తున్న మోరపల్లి రైతులు

# రుణమాఫీ చేయాలి

జగిత్యాల రూరల్, డిసెంబర్ 9: రుణమాఫీ చేయాలని కోరుతూ సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతకు మోరపల్లి రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 150 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల రుణం ఉన్న రైతులకు కూడా మాఫీ కాలేదని, 35 శాతం మంది రుణ మాఫీ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కనీసం రైతుబంధు ఇస్తే తమకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

- 'భారత్‌మాల' పనుల అడ్డగింత



*భారత్‌మాల హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం పెంచి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి శివారులో జరుగుతున్న రోడ్డు పనులను అడ్డుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హైవే అధికారులు చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు. – రాజోలి*

# చనిపోతే సమస్య పరిష్కరిస్తరా?

### ప్రజావాణిలో ఓ మహిళా రైతు కన్నీటి పర్యంతం

ఆదిబట్ల, డిసెంబర్ 9: 'నా చావుతోనైనా సమస్య పరిష్కరిస్తరా' అని ఓ మహిళా రైతు కన్నీటి పర్యమైంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన తోపు గొండ రాములమ్మ భర్త గతంలో చనిపోయాడు. ఆమెకు గ్రామంలో సర్వే నంబర్ 185 లో మూడెకరాల అసైన్డ్ భూమి ఉంది. కలెక్టర్ సర్టిఫికెట్ కూడా మంజూరు చేశారు. చేవెళ్ల రెవెన్యూ అధికారులకు ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని దరఖాస్తు చేసుకోగా.. ఈ ఫైల్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నదని చెప్పడంతో ఏడాదిగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నది. అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసి తన గోడును అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వెల్లడించింది. సమస్యను పరిష్కరించకుంటే ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొంది.



పోలీసులు బయటికి పంపించడంతో కన్నీటి పర్యంతమవుతున్న రైతు రాములమ్మ

# రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తరు?

- మాఫీ పూర్తయిందని మీరు ఎట్ల చెప్తున్నరు
- కానివారు మాలాంటోళ్లు రాష్ట్రంలో మస్తుగున్నరు
- సర్కార్‌పై రైతుల ఆగ్రహం
- వరంగల్, మానుకోట కలెక్టరేట్ల ఎదుట నిరసన

ఖిలా వరంగల్/మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 9 : రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారం టూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని జాబితాలు విడుదల చేసినా అందులో తమ పేర్లు లేవంటూ వారు మండిపడుతున్నారు. ఓ వైపు రుణమాఫీ పూర్తయిందని ప్రభుత్వం చెబుతున్నా మాఫీ కాని రైతులు ఇంకా చాలామందే ఉన్నారని వారు అంటున్నారు. రుణమాఫీ కానీ రైతులంతా సోమవారం వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్ల నిరసన తెలిపారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట, మహబూబాబాద్ మండలం మాధవాపురం, కురవి మండలం బంజారాతండా రైతులు ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు దిగారు. అర్హులైన తమకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. నెక్కొండ మండలం ఐవోబీలో 1500 మంది రైతుల ఖాతాలు ఉండగా ఇందులో 600 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని వారు పేర్కొన్నారు. మిగతా 900 మందికి అధికారుల తప్పిదంతో మాఫీకాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్లు జీ సంధ్యారాణి, వీరబ్రహ్మాచారికి వినతి పత్రాలు సమర్పించారు.



ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం చిరుమర్రిలో పోస్టుకార్డులతో రైతులు, రైతు సంఘం నాయకులు

## రుణమాఫీ కోసం పోస్టుకార్డు ఉద్యమం

### సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉత్తరాలు

ముదిగొండ, డిసెంబర్ 9 : కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ.. మాఫీ వర్తించని రైతులు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో రుణమాఫీ వర్తించని రైతులంతా సోమవారం రుణమాఫీతోపాటు రైతు భరోసా ఇవ్వాలని పోస్టుకార్డుపై రాసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్ మాట్లాడుతూ.. రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. మాఫీ కాని వారు చాలామంది ఉన్నట్టు తెలిపారు. మాఫీ కోసం ఎదురు చూస్తున్న వారు ఊరూరా ఉన్నారని చెప్పారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి చెప్పిన లెక్క తప్పా లేదా ఇందులో ఏ మైనా కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. మాఫీ వర్తించని రైతుల వివరాలు సేకరించి అర్హులైన వారికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

### సర్కార్ కాలయాపన చేస్తున్నది..



2 లక్షల లోపు రుణం తీసుకున్న వారు మా గ్రామంలోనే సుమారు 900 మంది ఉన్నారు. రుణమాఫీకి అర్హులైనా సర్కారు కాలయాపన చేస్తున్నది. రూ.90 వేలు రుణం తీసుకున్నా మాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసినం అంటున్నడు.

- వెంకటేశ్, అలంకానిపేట, నెక్కొండ, వరంగల్

### రుణమాఫీ కాలేదు



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత రుణమాఫీ కాలేదు. ఈ సర్కార్‌తో ప్రజలకు న్యాయం జరుగుతలేదు. రుణ మాఫీ కాలేదని అధికారుల దగ్గరకు పోయి అడిగినా పట్టించుకోవడం లేదు. రుణ మాఫీ కోసం బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగి యాష్ట కొస్తాంది. ఇప్పటికైనా ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలె.

- గుగులోత్ సునీత, మాధవాపురం, మహబూబాబాద్ జిల్లా



సదస్సులో పాల్గొన్న వక్తలు జీవన్‌కుమార్, బాబూరావు, విమలక్క తదితరులు

# రైతులను ముంచిన రేవంత్ సర్కారు

- 2లక్షల మాఫీ అమలు చేయాలి
- రాష్ట్ర రైతాంగ సదస్సులో వక్తలు

చిక్కడపల్లి, డిసెంబర్ 9: రాష్ట్రంలో 40శాతం మందికే రుణమాఫీ చేసి మిగతా రైతులను రేవంత్ సర్కారు నిండా ముంచిందని వక్తలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సులో పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బాబూరావు, మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు ఎస్ జీవన్ కుమార్, న్యాయవాది కట్టా భగవంత్‌రెడ్డి, సామాజిక విశ్లేషకులు దొంతి నర్సింహారెడ్డి, కన్నెగంటి రవి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పాల్గొని మాట్లాడారు. రైతులందరికీ ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించి ఏడాది కావొస్తున్నదని, ఇప్పటి వరకు మూడు విడుతల్లో కేవలం 40 శాతం మందికే మాఫీ చేశారని తెలిపారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పేర్కొన్నారు.

# హాస్టల్ పైనుంచి జారిపడిన విద్యార్థిని

- వెన్నెముక, రెండు కాళ్లకు తీవ్రగాయాలు..
- షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

షాద్‌నగర్, డిసెంబర్ 9: గిరిజన వసతి గృహంపైనుంచి ప్రమాదవశాత్తు జారిపడగా ఓ విద్యార్థినికి తీవ్రగాయాలైన ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హాజిపల్లిరోడ్డులోగల గిరిజన వసతిగృహంలో ఉంటున్న పూజ ప్రభుత్వ బాలికల కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. శుక్రవారం రాత్రి ప్రమాదశాత్తు వసతిగృహం రెండో అంతస్థు నుంచి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే చేరుకుని విద్యార్థినిని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రెండు కాళ్లతోపాటు వెన్నెముకకు తీవ్రగాయాలయ్యాయని, చికిత్సకు రూ. 8లక్షల వరకు ఖర్చువుతాయని వైద్యులు తెలుపడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు విద్యార్థినిని ఉస్మానియా దవాఖానలో చేర్పించారు. వసతి గృహం నిర్వాహకుల నిర్లక్ష్యంతో తమ కూతురికి ఈదుస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. చికిత్సకు నిర్వాహకులు ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న విద్యార్థిని

# అంగన్‌వాడీ పిల్లలను పీఎంశ్రీకి పంపొద్దు

- అంగన్‌వాడీలకు డబ్ల్యూడీసీడబ్ల్యూ డైరెక్టర్ ఆదేశం

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలను విద్యాశాఖ ఆధ్వర్యంలోని పీఎంశ్రీ ప్రీప్రైమరీ స్కూళ్లకు పంపొద్దని మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ అంగన్‌వాడీ టీచర్లకు తెలిపారు. అంగన్‌వాడీ పిల్లలను తమ ప్రీ ప్రైమరీ స్కూళ్లకు పంపాలంటూ ఎవరైనా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి చేస్తే తమ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఎవరి బెదిరింపులకు భయపడొద్దని స్పష్టంచేశారు. 'పీఎంశ్రీ'లకు అంగన్‌వాడీ టీచర్లను పంపండి' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో సోమవారం ప్రచురితమైన వార్తకు కాంతి వెస్లీ స్పందించారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అంగన్‌వాడీలు ఫిర్యాదు చేసిన తర్వాత ప్రకటించారు. అంగన్‌వాడీ పిల్లలను పీఎంశ్రీలకు తరలించాలంటూ హెడ్‌మాస్టర్లు తమను ఒత్తిడి చేస్తున్నారంటూ స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్లు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ పిల్లలను ఎక్కడికీ పంపేదిలేదని మంత్రి స్పష్టంచేశారు.

## దిలావర్‌పూర్ ఘటనలో 122 కేసులు?

దిలావర్‌పూర్, డిసెంబర్ 9: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్-గుండంపల్లి మధ్యలో ఇథనాల్ ఫ్యాక్టరీ తరలింపు కోసం పోరాడిన స్థానిక రైతులు, ప్రజలపై తాజాగా 122 కేసులు నమోదైనట్టు సమాచారం. గత నెల 26, 27 తేదీల్లో వేలాది మంది రోడ్ల మీదకు రావడంతో దిలావర్‌పూర్ మరో లగచర్లను తలపించింది. వారితో మాట్లాడేందుకు వెళ్లిన నిర్మల్ ఆర్డీవో రత్న కల్యాణిని నిర్బంధించి, ఆమె వాహనాన్ని ధ్వంసం చేయడంతో ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చింది. ఫ్యాక్టరీని తరలిస్తామని కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు స్థానికులు నిరసనలు విరమించారు. ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాటంలో ఇప్పటివరకు నమోదైన కేసులను ఎత్తివేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కానీ, అందుకు వ్యతిరేకంగా పోలీసులు 122 మందిపై కేసులు నమోదు చేశారని, అందులో 18 మంది మహిళలు ఉన్నట్టు వార్తలు వైరల్‌గా మారాయి. ఆర్డీవో డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఈనెల 7న కేసులు నమోదు చేసినట్టు స్థానికులు చెప్పారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.